# స్వాప్నికుడు

**భూమి గుండ్రంగా ఉందనే వాక్యం నన్నెపుడూ నవ్విస్తుంది. కవ్విస్తుంది. భూమి గుండ్రంగా ఉంటే - ఈ వైపు ఆ వైపుకు తిరిగినపుడు సముద్రపు నీరంతా కిందికి ఒలికిపోదా, మనుషులంతా తలకిందులై పడిపోరా, ఇల్లూ, వాములూ కూలిపోవా, ఇంట్లో సామానంతా స్థానభ్రంశం చెందదా... అనే చిన్నప్పటి చిలిపి ప్రశ్నల జాబితాకు, నన్ను వేలు పట్టుకు నడిపించి, నాకు వాస్తవ ప్రపంచాన్ని చూపించిన మా వెంకట్రామయ్య పెదనాన్నగారు నా స్మృతి పథంలో ఎప్పుడూ కదలాడుతూనే ఉంటారు.**


పది సంవత్సరాల తర్వాత మా పెదనాన్నగారి ఊరికెళ్తున్నాను. ఏ.సి. ఆఫీసు రూముల్ని వదిలి, అపార్టుమెంటుల్లోని అగ్గిపెట్టెల్లాంటి ఇంటిని వదలి, సిటీ బస్సులు, ఆటోలు నింపేసిన కాలుష్యపు రోడ్లను వదలి, గుండె నిండా స్వార్థాన్ని నింపుకుని, నవ్వును పులుముకునే ముఖాల్ని వదలి, కృత్రిమంలోంచి వాస్తవంలోకి వెళ్తున్నాను.

'వాస్తవం' అన్న పలుకు అమ్మ ప్రేమలోని కమ్మదనాన్ని ఇస్తుందన్నది నాకెరుక.

రైలు రావటానికి ఇక పది నిముషాలే సమయముంది. ఫ్లాట్‌పారం మీద సిమెంటు చప్టాపై కూర్చున్నాను. ఊరికెళ్తున్నానన్న తృప్తి, పెదనాన్నగారితో మూడు రోజులు గడపబోతున్న ఆనందం, ప్రశాంతతను చేకూరుస్తున్నాయి.

దూరంగా మా ప్యూను శేషయ్య కనిపించాడు. వెనుక మరో స్కూలు కరెస్పాండెంట్ కనిపించాడు. వాళ్ళు కచ్చితంగా నా కోసమేనని తెలుసు. వారి నుండి ఎలాగయినా తప్పించుకోవాలి. లేకుంటే నా ఆనందాన్ని, తృప్తిని ఆదిలోనే హంసపాదులా చేస్తారు.

"ఎంత అర్జంటు పనయినా, నన్ను ఎవ్వరితో కలిసేందుకు ప్రయత్నించవద్దు" అని శేషయ్యతో చెప్పే వచ్చాను. కాస్తయినా బుద్ధిలేని మనిషి... ఆ కరెస్పాండెంటు పదో, పాతికో ముఖాన వేసి ఉంటాడు. వాడికదే ఆనందం. ఇతరుల ఆనందంతో వాడికేం పని... ఏకంగా స్టేషనుకే మనిషిని వెంటేసుకుని వచ్చాడు. మళ్ళీ ఇక్కడ చిన్న ఆఫీసు, ఫైళ్ల వాసన, కృత్రిమమైన మాటలు... అన్నీ మామూలే. ఇవేవీ వద్దు..."రైలు వచ్చే వరకు వీరికంట పడకుంటే, వాళ్ళే వెళ్ళిపోతారు" అనుకొని, దినపత్రికను పూర్తిగా విప్పార్చి, ముఖం కనిపించకుండా అడ్డం వేసుకుని, చదువుతున్నట్లు నటించాను. శేషయ్య కళ్ళు ఎక్సరే కళ్ళు. ప్రతి ముఖాన్ని పరిశీలనగా చూసుకుంటూ సమీపిస్తున్నాడు. భయం వేసింది. "వెంటనే లేచి ఫ్లాట్‌పారం చివరికెళ్తే బాగుండునా"- అనిపించింది. లేస్తే పట్టేస్తాడు. లేవకపోవటమే ఉత్తమమనిపించింది. నన్ను దాటి వెళ్ళిపోయారు. భయం పోయింది. నేను వాడినే గమనిస్తున్నాను. వాడు నన్నే వెతుకుతూ మళ్ళీ ఇటుగా వస్తున్నాడు. మళ్ళీ పత్రిక ముఖానికి కప్పేసుకున్నాను. నన్ను దాటి వెళ్ళాడు. అక్కడక్కడే తచ్చాడుతున్నాడు. రైలు వచ్చి ఆగింది. ఆగటం తోటే ఏమీ ఆలోచించకుండా ఎదురుగా ఉన్న బోగీలోకి ఎక్కేసాను. అది రెండవతరగతి స్లీపర్. టిసి వెనక్కు తోయబోయాడు.




"అయ్యా బాబూ, నన్ను కాపాడు- నన్ను బయటకు తోస్తే, నా పని అయిపోయినట్లే"- అని నచ్చజెప్పి కూర్చొని, కిటికి గుండా బయటకు చూశాను.

ఎదురుగా శేషయ్య. "సార్... కనిపించి కాపాడినారు సార్... ఈయనగారు మీకోసమే వచ్చారు సార్... సంతకం కావాలంట. మీరు సంతకం చేస్తే వాళ్ళ స్కూలు అప్‌గ్రేడ్ అవుతుందట." అని ఇంకా ఏవేవో చెబుతున్నాడు, రైలు వెళ్ళిపోతుందన్న ఆతురతతో.

రైలు కూత వేసింది... నాకు సంతోషం... వాడికి ఆతురత...

"తియ్యవయ్యా ఫైలు... డబ్బుగూడ తియ్యి... లేటయితే రైలుపోతుంది. మల్ల సంతకంలే... గింతకం లే..." అని తొందరపెడుతున్నాడు ఆయనను.

కింద సూట్‌కేసు పరచి, కాగితాలు సర్ది, జేబుల్లోంచి డబ్బులు తీసి, కాగితాలపై పెట్టి చేతులో పట్టుకొన్నాడు. కలికాల పురుషుడు కరెస్పాండెంటు.

రైలు పెద్ద కూత వేస్తూ మెల్లగా కదిలింది. నాలో సంతోషం అధికం. వారిలో మరింత ఆతురత. శేషయ్య ఆ కాగితాలు తీసుకొని నా ముందు పెట్టబోయాడు... నాకు చిరాకేసింది.

"అయ్యా- ఈ ప్రపంచం ఈ రోజుతోనే ముగిసిపోతుందా... నేను మళ్ళీరానా... సంతకం చేయనా... మీ పని జరగదా... ఎందుకింత తొందర... తర్వాత పెడతాన్లే వెళ్ళు..." అంటూ స్వచ్ఛంగా నవ్వాను. వారిలో స్వచ్ఛమైన బాధ కనిపించింది.

అలాంటి వాస్తవ సుఖదుఃఖాలు అరుదుగా తటస్థించినా ఒకింత ఊరటనిస్తాయి. కానీ అందులోని ప్రతి కదలికా స్వార్థంతో నిండి ఉందన్న విషయం విన్నవించు కొంటున్నాను.

## చెన్నా రామమూర్తి

రైలు దిగేసరికి సాయంత్రం ఐదు దాటింది. సాయంసంధ్య. గోధూళివేల... తరంగ చుంబిత తటాకపు నురగలు, దారివెంట పుడమితల్లి ఆకుపచ్చ చీరని చుట్టుకొన్నట్లు పంటలూ, అక్కడక్కడా గోవుల మందలూ, అల్లంత దూరంలో వెళ్తున్న ఎద్దుల బండి చక్రం చేసే 'టక్, టక్' శబ్దం, పడమటి కనుమల్లోకి వెళ్తున్న సూర్యుడు, ఆపైన సింధూరం చిందే ఆకాశం- చక్కటి ఆ పల్లె వాతావరణం నన్ను పులకింప జేసింది.

ఇల్లు చేరుకున్నాను. పెదనాన్నగారు ఇరవైమంది పిల్లల్ని ముందు కూర్చుండబెట్టుకొని, నీతిచంద్రికలోని భాగాల్ని వివరిస్తున్నాడు. నన్ను చూసి సంతోషంతో ఆహ్వానించాడు. పెదనాన్నకు అరవై సంవత్సరాల వయసు... చూపు సరిగాలేదు. మనిషి కాస్త తగ్గినట్లున్నాడు. మాటల్లో కాఠిన్యత తగ్గింది. ఉన్న ఊరు కన్నతల్లిగా భావించే మనిషి. ఇద్దరు కొడుకులున్నా, వాళ్ళెపుడో వెళ్ళిపోయి టౌనులో స్థిరపడ్డారు. వీళ్ళ ఉనికి పట్టించుకునే వాళ్ళు కాదు. పెద్దమ్మ అండదండలతో ఇద్దరూ కాలం వెళ్ళదీస్తున్నారు.

పెద్దమ్మ సంతోషంతో కాళ్ళకు నీళ్ళు అందించింది. నా భార్యా, పిల్లల గురించి అడిగింది. కాఫీ తీసుకున్న తరువాత నేనూ, పెదనాన్న అలా ఊరుబయటకు వెళ్ళాం...

చెప్పవలసిన ఎన్నో భావాల్ని అదిమి పట్టుకొన్నట్లుంది అయన ముఖం... తన కొడుకులు రాజేష్, రమేష్‌ల గురించో, తన వార్ధక్య సాధక బాధకాల గురించో, తమ ఆర్థిక పరిస్థితి గురించో చెబుతాడు అనుకున్నాను. మౌనంగా నడుస్తున్నాడు. మర్రిచెట్టు వద్ద అరుగు మీద కూర్చొన్నాం-


"ఎందుకు పెదనాన్న ఇంకా ట్యూషన్లు చెబుతున్నారు... ఈ వయసులో ఏదో ఒక కొడుకు వద్ద ఉండిపోకూడదా బాగుంటుంది" అన్నాను నేనే కల్పించుకొని.

"నువ్వు డి.ఇ.వో... అయ్యావని పేపర్లో చూశాను. ఆరోజు సంతోషంతో పండుగ చేసుకొన్నాం. ఎందుకంటే, మన వాడు డిఇవో అయితే జిల్లా అంతా విద్యాగంధం విరబూస్తుందని, సమూలమయిన మార్పులొస్తాయని... అయినా రాజు... నేటి విద్యను 'విద్య' అనవచ్చా... ఏ పిల్లవాడికి శుక్లాంబరధరం శ్లోకం గూడా రాదు. రూపాయకు పైసలెన్ని అంటే ఎవడూ చెప్పడు... సభ్యత, సంస్కారం, సంస్కృతి గురించి పాఠాలేవి...? సంస్కృతి నేర్పకపోతే పిల్లలకు ఎలా వస్తుంది. టీచర్లు టౌన్లనుంచి యంత్రాల్లా వచ్చి, యంత్రాల్లా వెళ్తున్నారే గాని, ఈ పల్లెలో ఉండి, వీరిని బాగుపరచే వారెవరు చెప్పు. అందుకే రోజూ పిల్లలకి నీతిచంద్రిక గురించి చెబుతున్నాను. కాదయ్యా డి.ఇ.వో... మీరు తల్చుకుంటే పాఠ్యపుస్తకాల్లో మార్పులు తీసుకురాలేరా! పల్లెల స్థితిగతులు మార్చలేరా... ఈ విషయాన్ని నీకు లేఖ రాయాలనుకున్నా... అంతలోనే వచ్చేశావు-" అని నా ముఖంలోకి సూటిగా చూశాడు. నేను దాని గురించి ఆలోచిస్తూ ఉండిపోయాను.

"రాజేష్, రమేష్‌లు ఇద్దరూ టౌనులో ఉంటున్నారు. ఇరుకైన ఇళ్లు... బొటాబొటిగా జీతాలు... ఇక మేమూ వెళ్ళి భారం కామా" అన్నాడు.

అవి పైకి అన్న మాటలే గాని, లోపలి ఘోష మరొకటి ఉంది.

"అయినా తల్లిదండ్రులను చూడాల్సిన బాధ్యత కొడుకులకు ఉందా బాబు.. అలా ఉంటే వృద్ధాశ్రమాలు, వృద్ధుల సంఘాలు ఎలా ఏర్పడతాయి. తల్లి, తండ్రి అంటే బరువు నాయనా... బరువు... ఎందుకంటే వాళ్ళను నెత్తిన పెట్టుకొని మోయాలిగదా... అందుకు బరువు..." అని తల అటువైపు తిప్పుకొన్నాడు. తన కన్నీళ్ళు




నాకు కనిపించకుండా ఉండేందుకు.

చీకటి పడసాగింది. ఇంటివైపు నడుస్తున్నాం. మా నాన్నతో గడిపిన తమ మధుర క్షణాల్ని గుర్తుకు చేస్తున్నాడు. ఒకసారి ఇద్దరు శ్రీకృష్ణ రాయబారం నాటకం వేశారట. అందులో పెదనాన్నది కృష్ణుని వేషమట. ఈయన జానపదగేయాలు పాడుతుంటే, మా నాన్న దరువు వేసేవాడట.

"కోల్ కోల్ కోలె... కోలన్న కోల్ కోలె...

యా మేల్ మేల్ కోలె... యా మేలు కోలన్న..." అని కోలన్న పాట పాడితే ఒన్స్ మోర్ అని అడిగి మళ్ళీ పాడించుకునే వాళ్ళట. అంతటి కళాపురుషుడు పెదనాన్న...

దారిలో తన దోసకాయ తోటలోకి వెళ్ళి, మంచి కాయ తెంపుకొని వచ్చాడు. ఇంటి కెళ్ళి భోంచేసి ఆ కాయని తినేశాం...

పెదనాన్న అటకపైనున్న పుస్తకాల కట్ట దించి కిందుంచాడు. వాటి ప్రాముఖ్యతను వివరిస్తున్నాడు.

"పుస్తకం మంచి మిత్రుడయ్యా... మనిషి ఉన్నాడు చూశావ్... ఒక్కో వయస్సులో ఒక్కో బుద్ధి, నడవడిక వస్తాయి. పుస్తకం అలా కాదు. అదెప్పుడూ వ్యక్తి పరిపూర్ణతకే దోహదం చేస్తుంది. అలాంటి పుస్తకాల సారాంశాన్ని మీరు ప్రజలకందించాలయ్యా, అదే నా కోరిక" అంటూ కుతూహలంగా పుస్తకాలకు సంబంధించి ఎన్నో విషయాలు చెప్పాడు.

ఆయన ఓ నడిచే చరిత్ర. ఓ గ్రంథాలయం. ఓ విజ్ఞాన నిధి. అలాంటి వ్యక్తి వద్ద ఒక గంట గడిపినా జీవితం ధన్యమవుతుందని అనిపిస్తుంది. మరి కొడుకులు ఎందుకు వీళ్ళని పట్టించుకోకుండా వెళ్ళిపోయారా అనిపిస్తుంది.

పడుకోవటానికి సిద్ధపడుతున్నాం.

"రాజు... అన్నీ సరే... నువ్వే పని మీద వచ్చావో చెప్పనే లేదు... నా మాటలతోనే కాలయాపన చేస్తున్నా" అన్నాడు నా వైపు తిరిగి.

"ఊహు... ఏమీ లేదు పెదనాన్న... నాన్న తరువాత అంతటి వారు మీరు... కొన్ని నెలలుగా చూడాలనిపిస్తూ ఉంది... అందుకే లీవు పెట్టి వచ్చేశాను. అందునా చిన్నప్పుడు నేను పెరిగిన ఊరు... తిరిగిన నేల... పెంచిన మీరు... ఆహ్వానిస్తున్నట్లనిపించింది... అందుకే వచ్చేశాను..." అన్నాను.

ఊరి విషయాలు, అవీ ఇవీ మాట్లాడుతూ నిద్రలోకి జారుకొన్నాం...

ఉదయం తొమ్మిది గంటల సమయంలో మేము చిన్నప్పుడు నివసించిన ఇంటికి వెళ్ళాం... ఇంటి ముంగిట పంచటరుగులు ఉన్నాయి. పెదనాన్న కూర్చున్నాడు. నేను ఇంట్లోకి కెళ్ళి అణువణువూ పరిశీలించాను. ప్రతి అంగుళం నాకు గుర్తే... తీపి స్మృతులు ఒకటొకటీ నన్ను గత స్మృతుల్లోకి తీసికెళ్ళాయి. వచ్చి పంచటరుగుమీద కూర్చున్నాను.

"బాబూ నాదో కోరిక" అన్నాడు.

"ఏంటి పెదనాన్నా" అన్నాను.

పల్లెటూరు వదిలి అందరూ పట్నం తరలిపోతున్నారు గదా... ఎందుకో ఆలోచించావా... అక్కడ ఉన్నది, ఇక్కడ లేనిదేదో తెలుసుకున్నావా... అంత ఆలోచించే తీరిక మీకు లేదయ్యా... నేను చెబుతా విను. "పల్లె సీమలే పట్టణానికి పట్టుకొమ్మలు" అన్నారు గాంధీగారు. కొమ్మలు లేకుండా చెట్టు ఎలా నిలుస్తుందో ఈతరం వాళ్ళు ఆలోచించరు. టౌన్లకు పరుగో పరుగో అని వెళ్తున్నారు. దీనికి పరిష్కారం చెప్పమంటావా రాజు... పల్లెల్ని కొంచెం ఉద్ధరిస్తే సరిపోతుంది. టౌనులో కేంద్రీకృతమయ్యే విద్యాలయాల్ని, కార్యాలయాల్ని, కర్మాగారాల్ని పల్లెల్లో ఏర్పాటు చేస్తే- పల్లె వాళ్ళకు జీవన భృతి దొరుకుతుంది. సంస్కృతి మారుతుంది- కాదా!" అన్నట్లు ప్రశ్నార్థకంగా నా వైపు చూశాడు.

నిజం చెప్పాలంటే ఈ ఊహ నాకెప్పుడూ రాలేదనే చెప్పాలి...

"మన ఊర్లో ఎన్నేళ్ళుగానో 'చిన్నబడి' అలాగే ఉండిపోయింది. వందల మంది టౌనుకెళ్ళి హైస్కూల్లో చదువుతున్నారు. చిన్నబడిని పెద్దబడి చేయించవా బాబు... మీ ఇంటినే స్కూలుగా మార్చి దానికి మీ నాన్న పేరు పెట్టు, ఆయనకు జ్ఞాపకార్థంగా"- అన్నాడు.

"ఇటు చూశావా... ఈ అడవి... ఇక్కడి చెట్లతో మా వాళ్ళు ఎంతో అందంగా బొమ్మలు చెక్కి, టౌనులో దగాపడి పదో, పాతికకో వాళ్ళ కళను అమ్ముకుంటున్నారు. ప్రభుత్వంతో మాట్లాడి వాళ్లకు సంబంధించి శిల్ప కళల సంస్థను, ఎగ్జిబిషన్ సెంటరును ఏర్పాటు చేయించు... కేవలం రెండేళ్ళలో మార్పు వస్తుంది... రాదా రాజు" అని ప్రశ్నించాడు.

"రాజు- బరువనుకోకుండా చేస్తానంటే ఒక మాట చెబుతా... ఈ వాగు ఉంది చూశావు... ఎంత వానకురిసినా వాగు ఉప్పొంగి పారి అది ఏట్లో కలుస్తూ ఉంది... ఆ పారే నీటికి చెక్‌డ్యాం లాంటి కట్ట కట్టిస్తే... నాలుగు వందల ఎకరాలకు నీటి పారకం వస్తుంది. పంటలు బాగ పండుతాయి. ఈ వాగును ఫొటోలు తీయించి జిల్లా కలెక్టరుకు, ముఖ్యమంత్రికి నాలుగు సార్లు పంపించాను సమాధానమె రాలె. నాలాటి మామూలోళ్ళకు ఎవరు పలుకుతారు నాయనా... ఎట్లన్నగాని, నువ్వు అధికార్లను కలిసి, మన ఊరికి ఈ ఒక్క పని చేసి పెట్టాలయ్యా..." అన్నాడు. సగటు మనిషి తన అవసర నిమిత్తం వేడుకొన్న స్వరం తొంగి చూసింది.

"పెద్ద ఆఫీసరయ్యావు గదా... నీ మాట అక్కడ ఎవురయినా వింటారు. నువ్వు చేయాలనుకుంటే సులువుగా అవుతాయి. మా పల్లెటూరోళ్ళని కాపాడుతూ ఉండదయ్యా..." అని నా చేతుల్ని తన చేతుల్లోకి తీసుకొన్నాడు.

"తప్పక చేయిస్తా పెదనాన్నా. వాగుపైన కట్ట కట్టించేందుకు అన్ని విధాల ప్రయత్నిస్తా" అన్నాను ధృఢనిశ్చయంతో...

**ఎన్నో విషయాలు మూడురోజులుగా చెబుతూనే ఉన్నాడు. అయితే ఏ ఒక్కటీ తన సంసారానికీ, స్వార్థానికీ కాదన్నది అక్షరసత్యం. ఎన్నో ఊళ్ళు చూశాను. ఎందరినో వ్యక్తుల్ని కలిశాను. తన గురించి, తన ఇంటి గురించి, తన స్వార్థం గురించే యోచిస్తారు గాని, తన ఊరు గురించి, సామాజిక ప్రయోజనాన్ని గురించి ఎవరూ అడిగినట్లు గుర్తులేదు.**

ఇంకా ఎన్నో విషయాలు మూడురోజులుగా చెబుతూనే ఉన్నాడు. అయితే ఏ ఒక్కటీ తన సంసారానికీ, స్వార్థానికీ కాదన్నది అక్షరసత్యం. ఎన్నో ఊళ్ళు చూశాను. ఎందరినో వ్యక్తుల్ని కలిశాను. తన గురించి, తన ఇంటి గురించి, తన స్వార్థం గురించే యోచిస్తారు గాని, తన ఊరు గురించి, సామాజిక ప్రయోజనాన్ని గురించి ఎవరూ అడిగినట్లు గుర్తులేదు.

మంచి ఆలోచన రావటానికి ప్రధాని, రాష్ట్రపతి, ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం లేదు. వాళ్లస్థాయి వాళ్ళకుంటాయి. పెదనాన్నగారి ఆలోచనలన్నీ సామాజిక ప్రయోజనానికి చెందినవే.

తిరుగు ప్రయాణానికి సిద్ధమై రైల్వే స్టేషన్ చేరుకున్నాం ఇద్దరం. తన జేబు నుంచి నలిగిన కాగితాలు తీశాడు. అందులో వాగుకు సంబంధించి మూడు ఫొటోలు, ఇంతకు ముందు రాసి, పంపిన అర్జీలు ఉన్నాయి. ఫొటోలు నాకందించి "ఇవే బాబు వాగు పరవళ్ళు... ఎట్లయినా సరే, నువ్వు మాకు సాయం చేసి, ఈ పరవళ్లని, మన జీవితాలకు ఆనందపరవళ్లను చేయాలి. చేస్తావు కదూ..." అన్నాడు ఆనందంతో.

అంతటి పెద్దవ్యక్తి ఫొటోల్ని, కాగితాల్ని ఎంతో జాగ్రత్తగా తీసికొచ్చి రైలువద్దనే మరీ నొక్కిచెప్పి ఇవ్వాల్సిన అవసరాన్ని తల్చుకుంటే నాకు మళ్లీ గాంధీజీ జ్ఞప్తికొచ్చాడు.

రైల్లో ప్రయాణిస్తున్నాను. ధ్యాసంతా ఊరుపైన్నే, పెదనాన్న మాటలపైన్నే, వాగుపైన్నే, కట్టపైన్నే, ఫొటోలపైన్నే తిరుగుతోంది. కట్ట కట్టించినట్లు, కట్టపై పెదనాన్న అటూ ఇటూ కట్టెపట్టుకొని గాంధీలా తిరుగుతున్నట్లు... వందల మంది ధాన్యాన్ని తూర్పారబడుతున్నట్లు కమ్మని కల...

పెదనాన్నంటే ఎవరనుకున్నావు... మా నాన్నకు అన్న కాదు...

నా చిన్నప్పటి ట్యూషన్ మాస్టర్

ఆయన గాంధీజీ వారసుడు

కలలుకనే కళ్ళున్న వాడు

ప్రవహించే నదీ ప్రవాహం లాంటి వాడు

నిత్య స్వాప్నికుడు. ●